క్లుప్తంగా

విద్యార్థులకు కలెక్టర్ అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

ఖమ్మంఅర్బన్/ ఖమ్మం సహకారనగర్: ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబర్చిన ఖమ్మం బల్లేపల్లిలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాల విద్యార్థులు టి.సత్యసాయి, సీహెచ్.యశ్వంత్ దక్షిణ భారత స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 21 నుంచి 25 వరకు పాండిచ్చేరిలో జరగనున్న పోటీల్లో పాల్గొననున్న విద్యార్థులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, డీఈఓ సోమశేఖరశర్మ శుక్రవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఫాదర్ రాజారెడ్డి, గైడ్ టీచర్ కె.రోశయ్య పాల్గొన్నారు.

విద్యార్థినికి చేయూత


చెక్కు అందజేస్తున్న శ్రీ మిత్ర గ్రూప్ సభ్యులు

ఖమ్మంగాంధీచౌక్: కుసుమంచి మండలం నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన ఉల్లోజు కర్తీషా ఉస్మానియా మెడికల్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతుండగా ఫీజు నిమిత్తం శ్రీ మిత్ర గ్రూప్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్ కుమార్ చేయూత అందించారు. ఈ మేరకు శుక్రవారం రూ. 50 వేల చెక్కును విద్యార్థిని తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ రంగా శ్రీనివాస్, చెరుకూరి యుగంధర్, పాలవరపు శ్రీనివాస్, చారుగుండ్ల రవి, మహంకాళి నాగేష్ పాల్గొన్నారు.

రేపు నెలనెలా వెన్నెల

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు నెలనెలా వెన్నెల కార్యక్రమం జరగనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విశాఖపట్నంకు చెందిన జాస్మిన్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఈవెంట్స్ ఆధ్వర్యాన 'సంకల్పం' నాటిక ప్రదర్శన, వనం శ్రీముఖి నృత్య ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు నగర వాసులు, కళాకారులు విజయవంతం చేయాలని అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ, అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్, కళాపరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నాగబత్తిని రవి, డాక్టర్ వేల్పుల విజేత, పీఎస్ఎం అధ్యక్ష కార్యదర్శులు నామ లక్ష్మీనారాయణ, వేముల సదానంద్ ఓ ప్రకటనలో కోరారు.

రోడ్డు పనులు నిలిపేయాలి

ఖమ్మంరూరల్/ ఖమ్మం అర్బన్: మండలంలోని తీర్థాల నుండి బ్రాహ్మణపల్లి వరకు రోడ్డు పనులను నిలిపివేయాలని కోరుతూ ఆర్డీఓ నర్సింహారావుకు శుక్రవారం రైతులు వినతి పత్రం అందించారు. అధికారులు కేసు వేసిన భూముల్లో మాత్రమే పనులు నిలిపేస్తున్నారని, మిగతా ప్రాంతాల్లో పనులు కొనసాగిస్తున్నారని హైకోర్టు తీర్పు వచ్చే వరకు నిలిపివేయాలన్నారు. రైతులు నాగండ్ల శ్రీధర్, పి.వెంకటేశ్వర్లు, శ్రీధర్, రంగారావు, సుధీర్, శ్రీను, ప్రసాద్, బి.వెంకటయ్య, రవి, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖమ్మంఅర్బన్: 33/11 రోటరీనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీ నగర్ కాలనీ, గోపాలపురం, అల్లీపురం, పుట్టకోట ఫీడర్ల పరిధిలో లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించవల్సిందిగా కోరారు.

నియామకం

నేలకొండపల్లి: స్థానిక శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం చైర్మన్‌గా నేలకొండపల్లికి చెందిన కనమర్లపూడి రమేష్‌ను నియమించారు. అదే విధంగా పాలకవర్గ సభ్యులుగా మల్లయ్య, కోటేశ్వరీ, సత్యనారాయణ, రాంబాబు, పి.సత్యంలు శనివారం దేవాలయంలో ప్రమాణస్వీకారం చేయనున్నారు.

రాయలకు సన్మానం

నేలకొండపల్లి: విదేశీ పర్యటన ముగించుకుని స్వగ్రామం వచ్చిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావును శుక్రవారం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, సేవాదళ్ పాలేరు కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బోయిన వేణు, యూత్ కాంగ్రెస్ పాలేరు డివిజన్ ఉపాధ్యక్షుడు గట్టికుండ్ల విజయ్, చిన్న నాయక్, సాయి నవీన్, వెంకటేశ్వర్లు, సురేందర్ పాల్గొన్నారు.

ఆదాయం వచ్చేదెలా..?

కేఎంసీలో ఆస్తి పన్నుల వసూళ్లలో జాప్యం

- సర్వేలతో తీరిక లేకుండా సిబ్బంది
- ఇప్పటి వరకు 48.36 శాతమే వసూలు



కేఎంసీ కార్యాలయం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం కార్పొరేషన్ అభివృద్ధి, నిర్వహణ ఆదాయంపైనే ఆధారపడి ఉంటుంది. కేఎంసీకి ప్రభుత్వం నుంచి వచ్చే వనరులతో పాటు ప్రజలు చెల్లించే ఆస్తి పన్నులే ప్రధాన ఆదాయ వనరు. ప్రతీ ఏటా ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి 95 శాతం ఆస్తి పన్నులు అధికారులు వసూలు చేస్తుంటారు. అయితే ఈ ఏడాది పన్నుల వసూలులో అధికారులు, సిబ్బంది వెనుకబడుతున్నారు. ఇప్పటి వరకు 48 శాతం పన్నులు మాత్రమే వసూలు చేశారు. సెలవులు పోను మరో రెండు నెలల సమయం మాత్రమే ఆర్థిక సంవత్సరం ముగింపునకు గడువు ఉండగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంకా కోట్లాది రూపాయలు బకాయిలు వసూలు చేయాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తేనే కేఎంసీలో ఆశించిన మేర పన్నులు రాబట్టవచ్చని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి.

వసూళ్లలో జాప్యం..

కార్పొరేషన్‌లో గతేడాది ప్రణాళికలు ఏర్పరుచుకుని అధికారులు పన్నులు వసూలు చేశారు. ప్రతీ ఆర్థిక సంవత్సరం ముగింపునకు ముందు జనవరి నుండే పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించడంతో బకాయిదారులకు నోటీసులు అందించే కార్యక్రమాలు చేపట్టేవారు. అయితే ఈ ఏడాది పలు కారణాలతో అధికారులు పన్నుల వసూళ్లపై దృష్టి సారించలేదనే చర్చ జరుగుతుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు సంబంధించిన సర్వే విధుల్లో కేఎంసీ బిల్ కలెక్టర్లు ఉండడంతో వారు పన్నుల వసూళ్లను పక్కనపెట్టినట్లు తెలుస్తోంది. గతేడాది రూ.30 కోట్లకు పైగా పన్నులు వసూలు చేయగా ఈ ఏడాది రూ.32.02 కోట్లు ఆస్తి పన్నులు వసూలు చేయాలని అధికారులు లక్ష్యం నిర్దేశించుకున్నారు. అయితే కేఎంసీకి ఇప్పటివరకు ఆస్తి పన్ను ద్వారా రూ.16.54 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చింది.

ప్రణాళికలు చేస్తేనే..

పన్నుల వసూళ్లపై కేఎంసీ అధికారులు ప్రతీ ఏడాది ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తుంటారు. డిసెంబర్ నెల ముగిసే సమయానికి రూ.20 కోట్ల వరకు ఆస్తి పన్నులు వసూలు చేస్తుంటారు. ఆర్థిక సంవత్సరం చివరి మూడు నెలల్లో బకాయిదారులకు నోటీసులు ఇచ్చి, వారి వద్దకు వెళ్లి కలిసి పన్నులు చెల్లించేలా ప్రోత్సహిస్తుంటారు. అయితే ఈ ఏడాది పలు పథకాలకు సంబంధించిన సర్వేలు, కులగణన వంటి వాటిల్లో అధికారులు, సిబ్బంది అంతా పాల్గొనడంతో ఇప్పటివరకు ఆస్తి పన్నుల వసూళ్లపై పెద్దగా దృష్టి సారించినట్లు కనిపించడం లేదు. అధికారులు బిల్ కలెక్టర్లను పన్నుల వసూళ్లకు పూర్తిస్థాయిలో వినియోగిస్తేనే లక్ష్యాలను అధిగమించవచ్చనే చర్చ కేఎంసీలో నడుస్తుంది.

ఆస్తి పన్ను వివరాలు..

పన్ను లక్ష్యం	– రూ.32.02 కోట్లు
వసూలు చేసినవి	– రూ.15.48 కోట్లు
వసూలు చేయాల్సింది	– రూ.16.54 కోట్లు

చిత్తశుద్ధితో నగర అభివృద్ధి..

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల, పక్కన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, మేయర్ నీరజ తదితరులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగర అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పాటుపడుతున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం 3వ డివిజన్ జయనగర్ కాలనీలో వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. డివిజన్ కార్పొరేటర్ జగన్ ఇప్పుడు లేకపోవడం బాధాకరమని, అయినా ఆయన ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామని తెలిపారు. వరద నీరు సాఫీగా మున్నేరులోకి వెళ్లేలా రూ.200 కోట్లతో కాల్వ నిర్మాణం, వెలుగుమట్ల అర్బన్ పార్క్ అభివృద్ధి, రూ.30కోట్లతో ఖమ్మం ఖిల్లా అభివృద్ధి పనులు చేపడుతామని చెప్పారు. అలాగే, ఈనెల 26నుంచి అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, నూతన రేషన్ కార్డుల జారీ మొదలవుతాయని తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులను మంత్రి చొరవతో అభివృద్ధి చేస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సు ప్రవేశపెట్టామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఆర్డీఓ నర్సింహారావు, ఆర్అండ్‌బీ ఈఈ యుగంధర రావు, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, కమర్తపు మురళి, లకావత్ సైదులు, మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావ, మానుకొండ రాధాకిషోర్, దుర్గాప్రసాద్ ఉన్నారు.

తుమ్మలకు కృతజ్ఞతలు

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నూతన పాలకమండలి బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 15న మార్కెట్‌లో అగ్నిప్రమాదం జరగగా పరిశీలించిన మంత్రి రాత్రి వరకు ఫైర్ ఇంజన్ తెప్పించారని వెల్లడించారు. అలాగే, మార్కెట్ అభివృద్ధికి రూ.155 కోట్లు మంజూరు చేయడంపై నూతన చైర్మన్, వైస్ చైర్మన్లు యరగర్ల హన్మంతరావు, తల్లాడ రమేష్, డైరెక్టర్లు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

సర్వే సకాలంలో పూర్తి చేయాలి


వరిపైరును పరిశీలిస్తున్న డీఏఓ

కూసుమంచి: మండలంలోని గట్టుసింగారం, పెరకసింగారం గ్రామాల్లో కొనసాగుతున్న రైతు భరోసా సర్వేను శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య పరిశీలించారు. సర్వే చేపట్టిన సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వే శనివారంతో ముగుస్తుందని సోమ, మంగళవారాల్లో గ్రామ సభలు నిర్వహించి సాగుయోగ్యమైన భూముల జాబితా వెల్లడించటం జరుగుతుందన్నారు. అనంతరం డీఏఓ గట్టుసింగారంలో సాగులో ఉన్న మిర్చి, వరి పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దారు కరుణశ్రీ, ఏడీఏ సరిత, ఏఓ వాణి, ఏఈఓలు వంశీకృష్ణ, రవితేజ పాల్గొన్నారు.


పొలాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ

నేలకొండపల్లి: సంక్షేమ పథకాలపై చేపట్టిన సర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఖమ్మం ఆర్డీఓ జి.నరసింహారావు ఆదేశించారు. మండలంలోని గువ్వలగూడెం, మోటాపురం, రాజేశ్వరపురం గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఇంటింటా తిరిగి, క్షేత్ర స్థాయిలో పొలాల వద్దకు పరిశీలించారు. సర్వే అధికారులకు పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జె.మానిక్‌రావ్, ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, వ్యవసాయాధికారి యం.రాధ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఆలస్యం మధుసూదన్‌రావు, రవి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్ పాల్గొన్నారు.


గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

కామేపల్లి: ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి మధుసూదన్ అన్నారు. మండలంలోని పింజరమడుగు జీపీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించి డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీకి సంబంధించిన అర్హుల జాబితాను చదివి వినిపించారు. తహసీల్దార్ సుధాకర్, ఎంపీఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఐ సక్రు, కార్యదర్శి గోపిక ఉన్నారు.


పాతర్లపాడులో భూముల సర్వే..

తిరుమలాయపాలెం: మండలంలో జరుగుతున్న సర్వేను పాలేరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ రమేష్ పరిశీలించారు. మండలంలోని జూపెడ, పాతర్లపాడు గ్రామాల్లో తహసీల్దార్, సర్వేయర్, వ్యవసాయాధికారులు ప్రభుత్వ భూముల గుర్తింపుతో పాటు ప్రభుత్వ భూముల ఆక్రమణల గుర్తింపు కార్యక్రమాన్ని చేపట్టారు.

రైతులు ఉద్యమాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న గోవిందరావు

ఖమ్మంరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు రైతులు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరావు తెలిపారు. మండలంలోని గూడురుపాడులో గురువారం జరిగిన సంఘం మహాసభలో ఆయన మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా 75 శాతం వ్యవసాయ రంగంపై ఆధారపడి ప్రజలు జీవనం కొనసాగిస్తున్నారని, అయినా బడ్జెట్‌లో కేవలం 50 శాతం నిధులు మాత్రమే కేటాయించడం రైతులను విస్మరించడమేనన్నారు. రైతుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్ధినేని కర్ణకుమార్, మిడకంటి చినవెంకటరెడ్డి, ఎడ్లపల్లి శంకరయ్య, ఏలూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ హియరింగ్ హ్యాండిక్యాప్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ క్యాలెండర్లను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.అఫ్రజ్ బేగ్, కార్యదర్శి ఎండీ.రహీం, ట్రెజరర్ టి.సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మామిళ్లగూడెం: అఖిల భారత యువజన సమాఖ్య క్యాలెండర్లను బైపాస్‌రోడ్ గిరిప్రసాద్ భవన్ సీపీఐ కార్యాలయంలో ఆవిష్కరించారు. పార్టీ జాతీయ నాయకులు భాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గౌస్ పాషా, నానబాల రామకృష్ణ, ఉపాధ్యక్షులు మునిగే కోటేశ్వరరావు, కోటి, ఉసికల రవి, ఉపేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దోజం శ్రావణ్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనాథ్ రెడ్డి, శ్రావణ్, ఆఫీస్ బేరర్స్ ఉన్నారు.

సేవలు అభినందనీయం


విద్యార్థినికి చెక్, జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

ఖమ్మంసహకారనగర్: జిల్లాలో నిరుపేద విద్యార్థుల చదువుకు అండగా నిలుస్తున్న పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కడారు విజయ భాస్కరరెడ్డి అన్నారు. బీఫార్మసీ చదువుతున్న నిరుపేద విద్యార్థికి ఈడబోయిన ఇందుకు ట్రస్ట్ తరపున రూ.20 వేల చెక్కు, జ్ఞాపికను ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్యతో కలిసి శుక్రవారం ఆయన అందజేసి మాట్లాడారు. ట్రస్ట్ సభ్యులు మహంకాళి స్వరాజ్యలక్ష్మి, పరిశ లక్ష్మీరాజ్యం, బొగ్గారపు మధు, గొండేల మురళీకృష్ణ, పెన్నసర్లు స్వర్గం పుల్లయ్య, రామకృష్ణారావు, తల్లి అంజమ్మ ఉన్నారు.

గణపతి ఆలయంలో పూజలు


భక్తులకు అల్పాహార వితరణ

ఖమ్మం అర్బన్: ఖమ్మం ఇందిరానగర్ జంక్షన్‌లోని శ్రీ బాలగణపతి దేవాలయంలో శుక్రవారం సంకటహర చతుర్థిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు బాజిన్ని వీరయ్య, తిరుపతిరావు, ప్రధాన అర్చకులు గిరిధర్ ఆధ్వర్యాన పూజలు నిర్వహించగా చంద్రశేఖర్‌రావు, సుజాత దంపతులు అల్పాహారం సమకూర్చారు.

'ఉద్యమకారులను విస్మరించిన ప్రభుత్వాలు'

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వాలు విస్మరించాయని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ కేవీ.కృష్ణారావు అన్నారు. ఆదివారం మానుకోటలో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ యాత్రను విజయవంతం చేయాలని శుక్రవారం ఖమ్మం అమరవీరుల స్తూపం వద్ద జరిగిన సమావేశంలో కోరారు. ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య, పగడాల నరేందర్, రాష్ట్ర కార్యదర్శి రాచమల్ల ఉమా యాదవ్, ఉమ్మడి ఖమ్మం జిల్లా మహిళా కన్వీనర్ రెడ్డబోయిన వరలక్ష్మి, లింగనబోయిన సతీష్, రాజేంద్రనాయక్, బెల్లంకొండ నాగేశ్వరరావు, బాలిని భాస్కర్ రెడ్డి, కామని అనంతలక్ష్మి, స్వరూప రెడ్డి, ధనలక్ష్మి, జయ, పద్మ ఉన్నారు.

ఆటో బోల్తా

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు ఆటో పల్టీ కొట్టడంతో ఇరువురికి గాయాలైన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని నాచేపల్లి నుంచి నేలకొండపల్లికి పాల క్యాన్లతో వస్తున్న ఆటో నందిగామ బ్రాంచి కెనాల్ వద్ద పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. ఈ క్రమంలో ఆటో కాల్వలో పడకుండా చెట్టుకు తగలటంతో పెను ప్రమాదం తప్పింది.

వానరానికి అంత్యక్రియలు

కామేపల్లి: కుక్కల దాడిలో మృతి చెందిన వానరానికి గ్రామస్తులు శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. మండలంలోని పండితాపురం గ్రామంలో కోతిపై కుక్కలు దాడి చేయగా మృతిచెందడంతో ఖననం చేశారు.

కృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటుచేయాలి


నివాళులర్పిస్తున్న కృష్ణ, తదితరులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం ట్యాంక్‌బండ్‌పై శ్రీ కృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మున్నూరుకాపు రాష్ట్ర నాయకులు గుండాల కృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కృష్ణదేవరాయల జయంతి సందర్భంగా జిల్లా మున్నూరుకాపు అడ్‌హాక్ కమిటీ ఆధ్వర్యంలో పాత కలెక్టర్ ఆఫీస్ ఎదుట ఉన్న రాయల విగ్రహానికి శుక్రవారం పాలాభిషేకం చేసి, పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కొత్త సీతారాములు, నాసరయ్య, రాపర్తి రాజా, మాటేటి రవి, నరాల నరేష్, మోహన్ నాయుడు, జీవీవీఎల్ పాల్గొన్నారు.

వాసవీభవన్ అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని వాసవీభవన్ అధ్యక్షుడిగా మాటూరి సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఎన్నికలు నిర్వహించగా ఒకే నామినేషన్ రావడంతో అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యంను ఎన్నికల అధికారులు గెల్లా జగన్‌మోహన్‌రావు, వంగవీటి నాగేశ్వరరావు, రేగూరి హనుమంతరావు, కొత్త రమేష్, దోసపాటి చంద్రశేఖర్ ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాసవీ భవన్ ఆధునికీకరణ పనులు త్వరలోనే చేపడతామన్నారు. కాగా, అధ్యక్షుడిని డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావుతో పాటు నాగేశ్వరరావు, లక్ష్మణ్‌రావు, వెంకటరమణ గుప్తా, వాసు, సుబ్బయ్య, ఈగ అనిల్, అచ్యుత్‌రామయ్య, యుగంధర్ సన్మానించారు

కొనసాగుతున్న విజిలెన్స్ తనిఖీలు

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులపై విజిలెన్స్ తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు శుక్రవారం నగరంలో వీడీఎఫ్ రోడ్ల కొలతలను తీసుకున్నారు. పండుగకు ముందు కేఎంసీ కార్యాలయంలో పలు ఫైళ్లను పరిశీలించిన విజిలెన్స్ అధికారులు కార్యాలయ కొలతలు తీసుకుని సామర్థ్యాన్ని పరీక్షించారు. సంక్రాంతి తర్వాత నగరంలో పబ్లిక్ హెల్త్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన పనులను తనిఖీ చేస్తున్నారు. పది రోజులుగా విజిలెన్స్ అధికారుల తనిఖీలు ముమ్మరం కావడంపై తీవ్ర చర్చ జరుగుతుంది.

ఆర్థికసాయం

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి ఆధ్వర్యంలో శుక్రవారం పలువురికి ఖమ్మంలో ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల మరణించిన ధంసలాపురం కాలనీకి చెందిన నిరుపేద పద్మశాలి ఎర్రగుంట్ల తిరుపయ్య కుటుంబానికి రూ.6,000లు, మేదర బజార్‌కు చెందిన పారుపల్లి శ్రీ రాములు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.6,000 ఆర్థికసాయం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చిలకమర్రి శ్రీనివాస్ బాబు, ఖమ్మం నియోజకవర్గం అధ్యక్ష కార్యదర్శులు పెండం జనార్దన్, ఉద్యోగ విభాగ అధ్యక్షులు శ్రీను, సత్యనారాయణ, కొండలరావు, పులిపాటి సంపత్ కుమార్, వరప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఖమ్మంఅర్బన్: నగరంలోని మమతరోడ్డు విద్యుత్ సెక్షన్ పరిధిలో క్రిష్టా వెంచర్ పరిసరాల్లో 110 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ శుక్రవారం ఏర్పాటు చేసినట్లు ఏఈ చావా లక్ష్మణ్ తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని అంతరాయం లేకుండా సరఫరా సాగించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ యూపీహెచ్ కాలనీలో నిర్మాణంలో ఉన్న యూపీహెచ్ఎస్ భవన నిర్మాణ పనులను శుక్రవారం మున్సిపల్ ఎస్ఈ రంజిత్‌కుమార్, డీఈ ధరణీ పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటిస్తూ అంచనాలు ప్రకారం నిర్మాణం కొనసాగించాలని సూచించారు.

కమాండెంట్‌ను కలిసిన హోంగార్డులు

ఖమ్మంక్రైం: ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా ఖమ్మం వచ్చిన తెలంగాణ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ ఆర్.వెంకటేశ్వర్లును శుక్రవారం జిల్లా హోంగార్డు సంక్షేమసంఘం సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా వారి సమస్యలు కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆర్ఐ సురేష్, నాయకులు బంక శ్రీను, వెంకటేశ్వర్లు, వెంకన్న, నీరజ, రమేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు అందించాలి

కామేపల్లి: మండలంలోని అర్హులందరికీ రేషన్‌కార్డులు అందించాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు జాలె శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కామేపల్లిలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో పేదలు ప్రభుత్వ పథకాలను కోల్పోయారన్నారు. ఇప్పటికైనా సర్వే పేరుతో కాకుండా అర్హులను గుర్తించి రేషన్‌కార్డు అందించాలని కోరారు.

పేకాట స్థావరంపై దాడి

కామేపల్లి: మండలంలోని ముచ్చర్ల శివారులోని నిమ్మవాగు సమీపాన పలువురు శుక్రవారం పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇద్దరు పట్టుబడగా, మరో ఇద్దరు పరారయ్యారని ఎస్సై తెలిపారు. వీరి నుంచి రూ.800 నగదు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. తనిఖీల్లో ట్రెయినీ ఎస్సై రోహిత్, సిబ్బంది రాజేశ్, మధు, వెంకటరత్నం పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పునకు మార్కింగ్


మార్కింగ్‌ను అడ్డుకుంటున్న స్థానికులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పత్తి మార్కెట్ యార్డ్ నుండి సుందరయ్య నగర్, గోళ్లపాడు చానల్–2 మీదుగా ప్రకాశ్‌నగర్ వరకు రోడ్డు వెడల్పు పనులు అధికారులు ప్రారంభించారు. ఈ మేరకు సుందరయ్యనగర్‌లో 30 అడుగుల రోడ్డును 80 అడుగుల వెడల్పు చేసేందుకు సిబ్బంది శుక్రవారం మార్కింగ్ చేశారు. రోడ్డు వెడల్పు కోసం ఇళ్లకు మార్కింగ్ చేస్తుండగా స్థానికులు అభ్యంతరం తెలిపారు. సిబ్బంది వద్ద ఉన్న టేపులు, పరికరాలను స్థానికులు లాక్కోవడంతో సిబ్బంది పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు బందోబస్త్ నిర్వహించగా.. టౌన్ ప్లానింగ్ సిబ్బంది రోడ్డు వెడల్పుకు మార్కింగ్ చేశారు.